# 'అటవీ' ప్రాంతాన్ని వదిలి బతకలేం

**మమ్మల్ని అక్కడే బతుకనివ్వండి.. 'సిఎం ప్రజావాణి'లో చెంచుల వినతి..**
**'మీ'అభీష్టం మేరకే ముందుకెళ్తాం: చిన్నారెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'అడవి తల్లి ఒడిలోనే నివాసం ఉంటాం. పులులతో మమేకం అవుతాం. తరతరాలుగా నివాసం ఉంటున్న అటవీ ప్రాంతాన్ని మాత్రం వదిలి బయట ప్రాంతంలో జీవించలేం. మమ్మల్ని అక్కడే బతుకనివ్వండి' అంటూ అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఎ టి ఆర్ ) ప్రాంతం చెంచులు ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన 'సిఎం ప్రజావాణి' కార్యక్రమంలో ఎటిఆర్ ప్రాంత చెంచు జాతి గిరిజనులు 'సిఎం ప్రజావాణి' ఇన్‌చార్జ్ డాక్టర్ జి. చిన్నారెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. ఎ టి ఆర్ చెంచులు సార్లపల్లి పెంట చిగుర్ల మల్లికార్జున్, రాయిలేటి పెంట మండ్లి చిట్టెమ్మ, కొమ్మనపెంట చిగురుల నాగమ్మ, సార్లపల్లి పెంట కుడుముల తిరుపతయ్య తదితరులు చిన్నారెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు. తరతరాలుగా అడవి తల్లిని నమ్ముకుని అడవుల్లోనే నివసిస్తున్న తాము టైగర్ రిజర్వ్ కోసం చెంచు పెంటలను ఖాళీ చేసి బయటి ప్రాంతానికి వెళ్లి జీవించలేమని వారు విజ్ఞప్తి చేశారు.

**చెంచుల అభీష్టం మేరకే ముందుకు సాగుతాం:చిన్నారెడ్డి**

దీనిపైన డాక్టర్ జి చిన్నారెడ్డి స్పందిస్తూ చెంచులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, చెంచుల అభీష్టం మేరకు ముందుకు సాగుతామని భరోసానిచ్చారు. నాగర్ కర్నూల్ జిల్లా అటవీ అధికారి రేవంత్ చంద్రతో చిన్నారెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. చెంచు కుటుంబాలను అటవీ ప్రాంతం నుంచి బలవంతంగా ఖాళీ చేయించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. చెంచులతో అటవీ అధికారులు చర్చించేందుకు చిన్నారెడ్డి ఒక షెడ్యూల్ ను ఖరారు చేయించారు. ఈ కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి హర్ష, ప్రవాసి ప్రజావాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

**సిఎం ప్రజావాణిలో 401 దరఖాస్తులు**

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన 214వ సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 401 దరఖాస్తులు అందాయి.ఇందులో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 110, రెవెన్యూ శాఖకు సంబంధించి 72, ఇందిరమ్మ ఇండ్ల కోసం 125, ప్రవాసి ప్రజావాణికి 02 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 92 దరఖాస్తులు అందాయి.కాగా సిఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం చిన్నారెడ్డి సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, ఎసిపి ఉమేందర్, ఎన్.ఆర్.ఐ. సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, ప్రవాసి ప్రజావాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉత్తరాది, దక్షిణాది భేదాలు చూపి దేశాన్ని ముక్కలు చేస్తామంటే కుదరదు

**లోక్‌సభలో అమిత్ షా**



**న్యూఢిల్లీ :** త్తరాది, దక్షిణాది భేదాలు చూపి దేశాన్ని ముక్కలు చేస్తామంటే కుదరదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఇండియా కూటమి సభ్యులు వ్యతిరేకించారని ఆరోపించారు. మహిళలకు రిజర్వేషన్ కల్పించేందుకు విపక్ష కూటమి వ్యతిరేకమని విమర్శించారు. నారీమణులకు మేలు చేసే బిల్లులను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రతిపక్ష పార్టీలను ప్రశ్నించారు. మహిళా సాధికారత దిశగా చేసే పనులకు ఎందుకు మద్దతివ్వడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలుచేసేలా ముందుకెళ్తున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుత లోక్‌సభ నియోజకవర్గాల జనాభాలో తీవ్ర వ్యత్యాసం ఉందన్నారు. ఒక ఎంపి లక్షల మంది ప్రజల సమస్యలను ఎలా వినగలరని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సీట్ల పెంపుదలను కూడా విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై జరిగిన చర్చకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమాధానమిచ్చారు. నియమ, నిబంధనలకు అనుగుణంగా సభ జరుగుతుందని అమిత్ షా స్పష్టం చేశారు. 'ఇప్పటికే జనగణన ప్రారంభమైంది. ఉత్తరాదికి ఎంత అధికారం వస్తుందో, దక్షిణాదికి అంతే వస్తుంది. ఉత్తరాది, దక్షిణాది అంటూ ఎందుకంటున్నారు. దేశమంతా ఒకటే. ఆ ప్రాంతం, ఈ ప్రాంతం అంటూ విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది భేదాలు చూపి దేశాన్ని ముక్కలు చేస్తామంటే కుదరదు. దక్షిణాదే కాదు కేంద్రపాలిత ప్రాంతాలకు సైతం దేశంపై అంతే అధికారం ఉంటుంది. గట్టిగా చెప్పినంత మాత్రాన అబద్ధాలు నిజం అయిపోవు. ప్రస్తుతం దక్షిణాది 5 రాష్ట్రాల్లో 129 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. డీలిమిటేషన్ తర్వాత అవి 195 అవుతాయి. ప్రస్తుతం దక్షిణాదిలో సీట్ల సంఖ్య 23.7 శాతం ఉంది. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత కూడా అంతే ఉంటుంది. గంట సమయం ఇస్తే డీలిమిటేషన్ బిల్లులో సవరణలు చేసుకుని వస్తాం. అప్పుడు బిల్లుకు మద్దతిస్తారేమో కాంగ్రెస్ నేత వేణుగోపాల్‌ను చెప్పమనండి. ఎంపీ స్థానాలను 50 శాతం పెంచుతూ సవరణ తెచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. సభను గంట వాయిదా వేస్తే బిల్లులో సవరణ చేసి సభ్యులకు కాపీలు అందిస్తాం' అని అమిత్ షా స్పష్టం చేశారు.

# ఆర్‌టిసి ఉద్యోగులకు మద్దతు

**ఎన్. రాంచందర్ రావు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా తయారైందని, సామాన్య ప్రజల నుండి ప్రభుత్వ ఉద్యోగుల వరకు అందరూ రోడ్లెక్కి నిరసన తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. ఈ నెల 22 నుంచి సమ్మెకు సిద్ధమవుతున్న ఆర్‌టిసి కార్మికుల పోరాటానికి శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మద్దతు ప్రకటించారు. కార్మికుల ఐక్యతను దెబ్బతీసేందుకు ప్రభుత్వం కొన్ని సంఘాలతో లాలూచీ పడుతోందని ఆరోపించారు. విలీనం, పిఆర్‌సి ఏరియర్స్ విషయంలో కార్మికులను మోసం చేయాలని చూడటం దుర్మార్గమని రాంచందర్ రావు విమర్శించారు. రాష్ట్ర సచివాలయంలోనే ఉద్యోగులు 'భోజన విరామ నిరసన' చేపట్టడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజా సమస్యల కంటే తన వ్యక్తిగత ఇమేజ్ పెంచుకోవడంపైనే ఎక్కువ ఆసక్తి ఉందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలైన పిఆర్‌సి అమలు చేయలేని, పెండింగ్‌లో ఉన్న డిఎ, విడుదల చేయలేదని, పని చేయని హెల్త్ కార్డులు, ఓపిఎస్ హామీని తుంగలో తొక్కిందన్నారు. తక్షణమే ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులు, ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## ఆర్‌టిసి ఉద్యోగులకు రెండు పిఆర్‌సిలు నేడు ప్రకటించే అవకాశం!

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్‌టిసి) ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పనున్నట్లు తెలుస్తోంది. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మిక సంఘాలను పునరుద్ధరించడం వంటి సమస్యలతో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22 న ఉద్యోగులు సమ్మెకి వెళ్లనున్న నేపథ్యంలో ప్రభుత్వం నేడు(శనివారం) రెండు పే రివిజన్ కమిషన్(పిఆర్‌సి)లను ప్రకటించనున్నట్లు సమాచారం. మిగతా డిమాండ్లపై ఆర్‌టిసి అధికారులు జెఎసి నాయకులతో సమావేశం నిర్వహించి, ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే అంశం ప్రస్తుతం కమిటీ పరిశీలనలో ఉన్నట్లు ప్రభుత్వ యంత్రాంగం తెలిపింది. ప్రస్తుతానికి రెండు పిఆర్‌సిలు ప్రకటిస్తున్న నేపథ్యంలో కార్మికులను సమ్మె విరమింపజేసి, కమిటీ నివేదిక ప్రకారం విలీన అంశం పూర్తి చేస్తారని సమాచారం.

## 'రోహిత్ వేముల' చట్ట రూపకల్పనకు మంత్రివర్గ ఉప సంఘం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉన్నత విద్యా సంస్థల్లో వివక్షను రూపుమాపేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 'రోహిత్ వేముల తెలంగాణ (ఉన్నత విద్యలో గుర్తింపు ఆధారిత వివక్ష నిరోధక) బిల్లు2026' రూపకల్పనపై అధ్యయనం చేసేందుకు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మొత్తం ఐదుగురు మంత్రులతో కూడిన మంత్రి వర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యా సంస్థల్లో కులం, మతం లేదా ఇతర గుర్తింపుల ఆధారంగా జరిగే వివక్షను గుర్తించి, వాటిని అరికట్టడానికి పటిష్టమైన చట్టాన్ని రూపొందించేందుకు మంత్రివర్గ ఉప సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి పలు సిఫార్సులు చేయనుంది. ప్రస్తుత పరిస్థితులు, చట్టపరమైన అవసరాలను పరిశీలించి సమగ్ర నివేదికను సిద్ధం చేయనుంది. కాగా ఈ కమిటీ తన నివేదికను వీలైనంత త్వరగా ప్రభుత్వానికి సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**మంత్రివర్గ ఉప సంఘం :** చైర్మన్ డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, సభ్యులు నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కాగా ఈ కమిటీకి ఎస్‌సి అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లు పట్ల బిజెపికి చిత్తశుద్ధి లేదు: కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లుపై బిజెపికి చిత్తశుద్ధి లేదని మరోసారి నిరూపితమైందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రతిపక్షాలు అడ్డుకుంటాయనే స్పష్టమైన అవగాహన ఉన్నప్పటికీ, బిజెపి ఒక కుట్ర పూరితంగానే ఈ రెండు బిల్లులను కలిపి పార్లమెంట్ ముందుకు తీసుకొచ్చిందని ఆమె శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా కోటా బిల్లుతో డీలిమిటేషన్ బిల్లును ముడి పెట్టడంతో ప్రతిపక్షాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి లోక్ సభలో బిల్లు వీగిపోయేలా చేశాయని, రాజకీయ లబ్ధి కోసమే బిజెపి ఇలాంటి ప్రయత్నం చేసిందని మండిపడ్డారు.

**ఇప్పుడైనా ప్రజల వద్దకు వెళ్తామంటున్నారు**

పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు దూరంగా ఉన్నారని, అధికారం పోయిన రెండేళ్ల తరవాతనైనా ప్రజలకు వద్దకు వెళ్తామని చెబుతున్నారని కెటిఆర్‌ను ఉద్దేశించి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. బిఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ఎంఎల్‌ఎలు,నాయకులు కూడా రావాల్సిన సమయంలో వస్తారన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆమె జర్నలిస్టులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తమ నూతన రాజకీయ పార్టీలో 33 శాతం రిజర్వేషన్‌ను మహిళలకు కేటాయిస్తామని, అన్ని వర్గాలకూ ప్రాతినిధ్యం ఉండేలా చూస్తామన్నారు. తమ రాజకీయ పార్టీకి 'తెలంగాణ'నే మదర్‌బోర్డ్‌గా ఉంటుందన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**తెలంగాణ ఎంప్లాయిస్ టీచర్స్,పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ వినతి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, బకాయిలను విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ ఎంప్లాయిస్ టీచర్స్,పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మండల, డివిజన్ కేంద్రాల్లో వినతిపత్రాలను సమర్పించారు. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర తహసిల్దార్ల సంఘం అధ్యక్షులు (టిజిటిఎ) ఎస్.రాములు నేతృత్వంలోని జెఎసి నాయకులు నాంపల్లి తహశీల్దార్ నయీముద్దీన్‌కు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమములో టిపియుఎస్ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు హన్మంతరావు, టిఇఎ అధ్యక్షులు నిర్మలమ్మ, సిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దర్శన్ గౌడ్, టిజిటిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్ పాక,డిఎఒ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రవి తదితరులు పాల్గొన్నారు.

**టిజిఇజెఎసి...**

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (టిజిఇ జె ఎ సి) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. జెఎసి పిలుపు మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో శుక్రవారం 'భోజన విరామ నిరసన' కార్యక్రమం జరిగింది. నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌జిఒ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్, టిజిఒ కేంద్ర సంఘం అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు, కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డా.ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్), టిజిఒ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి బి.శ్యామ్, జెఎసి నాయకులు పి.రామసుబ్బా రావు(ఎస్‌టియు), చావా రవి(యుటిఎఫ్) తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగుల నిరసన




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ తెలంగాణ ఉద్యోగుల జెఎసి పిలుపు మేరకు టిజిఇజెఎసి హైదరాబాద్ సిటీ చైర్మన్ కట్కూరి శ్రీకాంత్, కన్వీనర్ గందూరి వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ తిలక్‌రోడ్‌లోని భీమ భవన్(పిఎఓ కార్యాలయం సమీపం)లో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మారం జగదీశ్వర్ (చైర్మన్, టిజిఇజెఎసి, ఎలూరి శ్రీనివాస్ రావు (సెక్రటరీ జనరల్), ఎస్ఎం.హుస్సేని (ముజీబ్) (డిప్యూటీ సెక్రటరీ జనరల్), బి శ్యామ్ స్థిత ప్రజ్ఞ హాజరయ్యారు. వీరితో పాటు కె. వెంకటేశ్వర్లు, సత్యనారాయణ గౌడ్, పి. హరి కృష్ణ, నిరంజన్ రెడ్డి, నరేంద్ర రావు, లక్ష్మణ్, శ్రీనివాస్, కృష్ణ, జి.శ్రీనివాస్ గౌడ్, ఎం.నాగిరెడ్డి, సి.అమరేందర్, బి. బాబుశంకర్, కె.స్వరూప, ఎ.రాజు, పి.ప్రభాకర్ రెడ్డి, మల్లికార్జున్, ఎం.లక్ష్మి, షేక్‌మహ్మద్, సంతోష్, బాల నర్సింగ్, ఆదిత్య, మహేష్, సత్యనారాయణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, సిపిఎస్ ఉద్యోగులు భారీగా పాల్గొని తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు మద్దతు తెలిపారు. 51శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి ప్రకటించడంతో పాటు ఉద్యోగుల హెల్త్ స్కీమ్ అమలు చేయాలన్నారు. పెండింగ్ బిల్లుల విడుదల, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పద్ధతి అమలు, సెక్రటేరియట్‌లో 12.5 శాతం కోటా అమలు చేయడంతో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు.

# రెండవ వేతన సవరణ అమలు చేయాలి: వైద్య ఉద్యోగులు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెండవ వేతన సవరణ సంఘం నివేదిక ప్రవేశపెట్టి అమలు చేయాలని, ఐదు విడతల కరువు భత్యం మంజూరు చేయడంతో పాటు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎం.శ్రీనివాస మూర్తి డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు శుక్రవారం రాష్ట్రంలోని వైద్య విధాన పరిషత్, డిఎంఇ, హెల్త్, ఇఎస్ఐ, ప్రివెంటివ్ మెడిసిన్ వైద్య సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు నిరసన ప్రదర్శనలు జరిపారు. నాచారం లోని ఇఎస్ఐ వైద్యశాలలో జరిగిన ప్రదర్శనను ఉద్దేశించి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వేణు కుమార్ మాట్లాడుతూ ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బకాయిలు తక్షణం చెల్లించాలని, ఇఎస్ఐ విభాగంలోని ఉద్యోగులకు నష్టం కలిగించే జిఓ 126 ను సవరించాలని డిమాండ్ చేశారు. గాంధీ వైద్యశాలలో ఎంసి ఎస్. రాజు మాట్లాడుతూ గుర్తింపు పొందిన యూనియన్ నాయకుల అక్రమ బదిలీలు రద్దు చేయాలని గౌరవ హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని, వైద్య విధాన పరిషత్ లో మినిమం టైం స్కేల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ నిరసన ప్రదర్శనల్లో ఎఐటియుసి అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, ఇందిరా శ్రీలక్ష్మి, నాయకులు పరబ్ కుమార్, శ్రీనివాస చారి, ప్రేమలత, స్వాతి, నర్సయ్య, కవిత, కిషన్, జగన్ మోహన్ రావు, శివానందం, సరస్వతి, సతీష్, ఖంరుద్దీన్, మధుసూదన్ రెడ్డి, విజయ లక్ష్మి, శ్రీధర్, కరుణాకర్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి మృతికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**అంజయ్య నాయక్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉస్మానియా మెడికల్ కాలేజీలో పిజి చదువుతున్న విద్యార్థి కాత్రవత్ సురేష్ మృతికి బాధ్యులైన వారిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామావత్ అంజయ్య నాయక్ డిమాండ్ చేశారు. ఉన్నత చదువులు చదివి సమాజానికి సేవ చేయాల్సిన ఒక గిరిజన మేధావిని ర్యాగింగ్, వేధింపుల రూపంలో బలి తీసుకోవడం విద్యావ్యవస్థకే మచ్చ అని, ఈహేయమైన చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఉస్మానియా మెడికల్ కాలేజీలో జరిగిన ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే ఉన్నత స్థాయి విచారణ జరిపించి, వేధింపులకు పాల్పడిన సీనియర్ విద్యార్థులపై తక్షణమే చర్యలు తీసుకోవడంతో పాటు కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్యంపై సైతం విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.అదేవిధంగా మృతుడు సురేష్ కుటుంబానికి ప్రభుత్వం రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిరోధక చట్టాలను మరింత పటిష్టంగా అమలు చేయాలని, తద్వారా భవిష్యత్తులో ఏ విద్యార్థి కూడా ఇలాంటి అన్యాయానికి గురికాకూడ చర్యలుతీసుకోవాలన్నారు. సురేష్ మృతి గిరిజన సమాజానికి తీరని లోటని, వారి కుటుంబ సభ్యులకు తెలంగాణ గిరిజన సమాఖ్య తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తోందని అంజయ్య నాయక్ పేర్కొన్నారు. న్యాయం జరిగే వరకు ఆ కుటుంబానికి అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు.

## బ్రీత్ అనలైజర్ టెస్ట్ ఎలా చేస్తారు?

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పోలీసు స్టేషన్‌కు వచ్చిన లాయర్‌కు ఏ అధికారంతో బ్రీత్‌అనలైజర్ పరీక్షలు నిర్వహించారని పంజాగుట్ట పోలీసులను హైకోర్టు ప్రశ్నించింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను పరిశీలించిన న్యాయమూర్తి పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వానికి, పోలీసులకు ఆదేశించారు. సింగర్ మంగ్లి వివాదం కేసులో ఫిర్యాదు పరిశీలనకు వెళ్లిన తనకు పోలీసులు బ్రీత్ అనలైజర్ పరీక్ష చేయడాన్ని తప్పుపడుతూ న్యాయవాది సుబ్బారావు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఇ.వి. వేణుగోపాల్ విచారించారు. పోలీసుల చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదు గురించి తెలుసుకోవడానికి వెళ్లిన తనపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని పిటిషనర్ లాయర్ వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు, చట్ట పరిమితులను అతిక్రమించి వ్యక్తిగత స్వేచ్ఛను భంగం కలిగించవద్దని స్పష్టం చేసింది. వీడియో ఫుటేజీని భద్రపరచాలని ఆదేశించారు. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

## కెసిఆర్, కెటిఆర్, హరీష్ పిటిషన్లపై తీర్పు రిజర్వు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమ సమయంలో ట్యాంక్ బండ్‌పై 2011లో జరిగిన మిలియన్ మార్చ్ సందర్భంగా నమోదైన కేసులను కొట్టివేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ అగ్రనేతలు మాజీ సీఎం కె. చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు వేసిన పిటిషన్లపై హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. వాళ్లు వేసిన పిటిషన్లను జస్టిస్ కె. సుజన విచారణ చేపట్టారు. పిటిషనర్లను సంఘటన స్థలంలో గుర్తించలేదని, వారి ప్రమేయానికి ఆధారాలు లేవని న్యాయవాదులు వాదించారు. మరోవైపు, ఇతర నిందితులపై చార్జిషీట్లు దాఖలైనప్పటికీ ఈ ముగ్గురిపై ఇంకా నమోదు కాలేదని పీపీ వాదించారు. వాదనలు పూర్తయ్యాక న్యాయమూర్తి తీర్పును వాయిదా వేశారు.

## ఎన్‌హెచ్‌లకు భూసేకరణలో పునరావాసం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ రహదారుల నిర్మాణం కోసం 1956 భూసేకరణ చట్టం కింద భూములను స్వాధీనం చేసుకున్నప్పటికీ భూమి లేదా స్థలం కోల్పోయిన వాళ్లకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పునరావాసం, పునర్నిర్మాణ ప్రయోజనాలు కల్పించాలని హైకోర్టు తీర్పు చెప్పింది.కరీంనగర్–వరంగల్ ఎన్‌హెచ్–563 భూసేకరణకు గురైన నిర్వాసితులకు పునరావాస ప్రయోజనాల కోసం వారు చేసిన దరఖాస్తులను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని భూసేకరణ అధికారి అయిన ఆర్డీవోను ఆదేశించింది. ఈ భూసేకరణలో పునరావాస పథకం అమలు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ ఎస్‌కె. సాబీర్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌ను సింగిల్ జడ్జి కొట్టివేయగా, వారు చేసిన అప్పీల్‌పై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల బెంచ్ సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేసింది. పునరావాస అవార్డు ప్రకటించకపోవడంతో 1956 చట్టంలోని ప్రత్యామ్నాయ నిబంధనలు వర్తించవని పేర్కొంది. అప్పీలుదారులు ఆర్డీవోకు దరఖాస్తు చేయాలని, ఎనిమిది వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆర్డీవోను ఆదేశించింది. ఇళ్లను కోల్పోయిన వారికి తాత్కాలిక నివాసం కోసం అధికారులను ఆశ్రయించవచ్చని సూచించింది.

## ఆర్డీవోకు నెల జైలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కోర్టు ఆదేశాలను అమలు చేయని రాజేంద్రనగర్ ఆర్డీవో కొప్పుల వెంకటరెడ్డికి హైకోర్టు నెలరోజుల జైలు శిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధించింది. రంగారెడ్డి జిల్లా పెద్దషాపూర్‌లోని 75 ఎకరాల భూమి వివాదంపై ఆరు వారాల్లో తీర్పు ఇవ్వాలని కోర్టు ఆదేశించినా అమలు చేయకపోవడంతో నవాబ్ మహమ్మద్ యూసుఫుద్దీన్ ఖాన్ ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు ఆదేశాల తర్వాత ఆర్డీవో పాత ఉత్తర్వులను యథాతథంగా జారీ చేయడాన్ని తప్పుబట్టింది. కోర్టు ఉత్తర్వుల పట్ల గౌరవాన్ని కాపాడటానికి శిక్ష అవసరమని పేర్కొంది. ఈ మేరకు తీర్పు వెలువరించింది. సంబంధిత వివాదాన్ని మరో అధికారికి కేటాయించాలని కలెక్టర్‌కు ఆదేశిస్తూ, అప్పీల్‌కు అవకాశం కల్పిస్తూ శిక్ష అమలును రెండు వారాలపాటు నిలిపివేసింది.




## కుల గణన సర్వే చైర్మన్, వైస్ చైర్మన్‌లకు కాంగ్రెస్ నాయకుల సన్మానం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలోనే మొట్టమొదటి సారిగా తెలంగాణ ప్రభుత్వం సామాజిక, రాజకీయ, ఆర్థిక, కుల గణన విషయంలో సర్వే నిర్వహించిన సందర్భంగా ప్రభుత్వం నియమించిన ఎక్స్‌పర్ట్ కమిటీ చైర్మన్ మాజీ సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కంచ అయిలయ్యను టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం వారి నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి, ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఆర్థిక సామాజిక, రాజకీయ అసమానతలను తొలగించేందుకు కమిటీ చేసిన సూచనలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. పారదర్శకంగా, శాస్త్రీయంగా, పకడ్బందీగా నివేదిక తయారు చేశారని, ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు.




సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ఇటీవల జరిగిన మోకాలు శస్త్ర చికిత్స అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌కు వచ్చిన సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపిన దృశ్యం.



## రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల వినతిపత్రాల సమర్పణ

**ప్రజాపక్షం/ఉప్పల్ :** తెలంగాణ ఎంప్లాయిస్, టీచర్స్ అండ్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మండల, డివిజన్ కేంద్రాల్లో వినతిపత్రాల సమర్పణ కార్యక్రమం జరిగింది. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి దృష్టి సారింపజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎంప్లాయిస్, టీచర్స్ అండ్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధి బిక్షం ఆధ్వర్యంలో ఉప్పల్ తహశీల్దార్ పూల్ సింగ్ చౌహాన్ కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిపియుఎస్ ప్రతినిధులు, పెన్షనర్ల ప్రతినిధులు, వివిధ జెఎసి భాగస్వామ్య పక్షాల ప్రతినిధులు పాల్గొని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.




## దోమల రహిత నగరాన్ని నిర్మిద్దాం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ప్రతి ఒక్కరూ దోమల రహిత నగర నిర్మాణానికి సహకరించాలని ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణి అన్నారు. శుక్రవారం జిహెచ్ఎంసి ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ పరిధిలోని అరవింద్ నగర్, దాయరకుంట ప్రాంతాలలో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని ప్రజలకు దోమల నివారణపై అవగాహన నిర్వహించారు. శుక్రవారంను ఫ్రైడే డ్రైడేలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ద్వారా దోమ గుడ్డు నుండి లార్వా దశ వరకు, పెద్ద దోమగా ఎలా మారుతుందో మొబైల్ వీడియోలు, ఫ్లిప్ బుక్స్ ద్వారా ప్రత్యక్షంగా వివరించారు. ముఖ్యంగా ఓవర్‌హెడ్ ట్యాంకులు, డ్రమ్ములు, కూలర్లు, పాత టైర్లు, పూలకుండీలు, కొబ్బరి బొండాలు, ఇతర నిరుపయోగమైన వస్తువులలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎడబ్ల్యూఎం డిఇఇ శ్రీనివాస్, ఏఇ చంద్రశేఖర్, ఎస్ఎస్, ఇఎస్ ,డబ్ల్యూఎస్, శానిటేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





## ఫ్యామిలీ కోర్టు జడ్జిగా కె.ఉమాదేవి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మేడ్చల్ మల్కాజ్‌గిరి ఫ్యామిలీ కోర్టు జడ్జిగా రాచపూడి శ్రీదేవి, అడిషనల్ ఫ్యామిలీ కోర్టు జడ్జిగా కె. ఉమాదేవిలు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలసి పూలమొక్కలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రత్తయ్య, దుర్గాప్రసాద్, లైబ్రరీ సెక్రెటరీ సాయినాథ్ గౌడ్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో చైతన్యం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం ఐటి కారిడార్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత ప్రమాదాల నివారణలో తీసుకోవలసిన జాగ్రత్తపై విద్యార్థులకు, గ్రామ ప్రజలకు రోడ్డు భద్రత, ప్రమాదాలు నివారణపై అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా పోచారం ఐటి కారిడార్ సిఐ కనకయ్య గౌడ్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పాటించాలని విద్యార్థులకు సూచించారు. లైసెన్స్, వాహనపత్రాలు లేకుండా వాహనాలు నడపరాదని హెచ్చరించారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలకు కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. అరైవ్ అలైవ్ అంటే సురక్షితంగా ప్రయాణించి ఇంటికి సురక్షితంగా చేరుకోవడం అనే భావన అని వివరించారు. వాహనదారులను నిలిపి పత్రాలను తనిఖీ చేశారు. ప్రజలందరూ రోడ్డు భద్రత నియమాలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని సిఐ కనకయ్య గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట్:** శామీర్‌పేట్ డివిజన్ పరిధిలోని పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మహిళా శక్తి మై వాయిస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్.హైమారెడ్డి అన్నారు. శుక్రవారం మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ కు గ్రామస్థులతో కలసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళా శక్తి మై వాయిస్ సంస్థ ఆధ్వర్యంలో శామీర్‌పేట్‌లోని పలు వార్డుల కార్యాలయంల్లో మీ సమస్య మా పరిష్కారం కార్యక్రమాలను నిర్వహించామని అన్నారు.ప్రజల నుండి వారి సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు అంబటి రమేష్, యశోద, అండాలు, మచ్చేంద్ర,తదితరులు పాల్గొన్నారు.



## గోల్డెన్ అవర్‌లో క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకువెళ్లే వారికి రూ.25 వేలు నజరానా

### మంత్రి పొన్నం ప్రభాకర్





**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** రోడ్డు ప్రమాదాల క్షతగాత్రులను కీలకమైన సమయం గా భావించే గోల్డెన్ అవర్‌లో సమీపంలోని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకొని వెళ్లి ప్రాణాలను కాపాడే వారిఆకి ప్రభుత్వం రూ. 25 వేలు పారితోషికంగా ఇస్తుందని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. క్షతగాత్రులను ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా తీసుకొని వెళ్లేందుకు స్పందించాలే తప్ప ఎలాంటి కాలయాపన చేయవద్దని, ఆస్పత్రికి తీసుకొని వెళ్లే వారికి పోలీసు కేసుల్లాంటి ఎలాంటి ఇబ్బందులు తలెత్తవన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం నాగోల్‌లోని ఆర్టీవో కార్యలయంలో జరిగిన అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి రోజు చిన్న పాటి నిర్లక్ష్యాల కారణంగా చోటు చేసుకొంటున్న రోడ్డు ప్రమాదాల కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోవటమే కాక క్షతగాత్రులై జీవితాంతం అచేతనంగా బెడ్డుకే పరిమితం అయి వారితో పాటు వారి కుటుంబాలు పలు అవస్థలకు గురవుతున్నారన్నారు. ప్రమాదాల నివారణ కోసం నిర్దేశించిన ట్రాఫిక్ నిబంధనలకు తమ కోసమే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని విధిగా వాటిని పాటించాలే తప్ప ఏ మాత్రం నిర్లక్ష్యం తగదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను సక్రమంగా పాటిస్తామంటూ కార్యక్రమంలో పాల్గొన్న వారితో మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వం ఎన్ని కార్యక్రమాలు చేసినా ప్రజలు చైతన్యవంతులై బాధ్యతగా ఉన్న నాడే ప్రమాదాలను నివారించగలుగుతామన్నారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగాప్రతి వారం ఒక అంశాన్ని ప్రాథమికంగా తీసుకొని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రయాణీకులు మరింత అప్రమత్తంగా ఉండే విధంగా బ్లాక్‌స్పాట్స్‌గా అవసరమైన జాగ్రత్తలు, సూచికల బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బాల్య దశ నుండే విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనల విషయమై సమగ్ర అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

## 60 ఏళ్ల ఆకాంక్షను అవమానపరిచిన బిజెపి

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

### తేజస్వి సూర్య దిష్టిబొమ్మ దగ్ధం

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** ఎఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఉప్పల్ డిపో ధర్నా చౌక్ వద్ద పార్లమెంట్‌లో తెలంగాణ విభజన ను పాకిస్థాన్‌తో పోల్చిన బిజెపి ఎంపి తేజస్వి సూర్య దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విభజనను భారత్—పాకిస్తాన్ విభజనతో పోల్చుతూ బిజెపి ఎంపి తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ వ్యాఖ్యలను ఆయన అత్యంత బాధ్యతారాహిత్యంగా, అవమానకరంగా, అగౌరపరుస్తూ, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించేలా ఉన్నదని, తెలంగాణ రాష్ట్రం అనేది దశాబ్దాలపాటు సాగిన పోరాటాలు, త్యాగాలు, ఆత్మ బలిదానాలు, ప్రజాస్వామ్య ఉద్యమాల ఫలితంగా ఏర్పడింది. అటువంటి చారిత్రక, రాజ్యాంగబద్ధమైన ప్రక్రియను భారత్—పాకిస్తాన్ విభజన వంటి బాధాకరమైన, హింసాత్మక ఘటనతో పోల్చడం వాస్తవాలకు విరుద్ధమే కాకుండా అత్యంత అవమానకరం అని తెలియచేశారు. తెలంగాణ నుంచి ఎన్నికైన బిజెపి ఎంపిల మౌనం దేనికి




సంకేతం అని, ఇంకా గుజరాత్ వారికి బానిసలుగా ఉంటారా? అని అడుగుతున్నాం. తెలంగాణ గౌరవాన్ని అవమానించినప్పుడు వారికి సిగ్గు అనిపించదా? మాట్లాడే ధైర్యం కోల్పోయారా? అని ప్రశ్నిస్తున్నాం. ఇది బిజెపి తెలంగాణ ఉద్యమాన్ని తక్కువచేసి చూసిన మొదటి సందర్భం కాదని ప్రజల ముందు తెలంగాణ ఏర్పాటుకు క్రెడిట్ తీసుకుంటామని చెప్పుకుంటున్న బిజెపి నాయకులు, రాష్ట్ర గౌరవాన్ని కాపాడాల్సిన సమయంలో మాత్రం వెనకడుగు వేస్తున్నారని, కావున తేజస్వి సూర్య తక్షణమే తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం, ఇలాంటి సందర్భాల్లో రాష్ట్రంలోని ప్రజాస్వామ్య శక్తులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఇలాంటి అవమానకర వ్యాఖ్యలను ఖండించి, తెలంగాణ గౌరవం, చరిత్రను రక్షించేందుకు ఐక్యంగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్, ఉపాధ్యక్షుడు హరీష్, కృష్ణ, శ్రీహరి, సిద్ధు, చింటూ, తదితరులు పాల్గొన్నారు.

## మూడు మాసాల నుండి తాళం వేసి ఉన్న ఇంట్లో మృతదేహం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మూడు మాసాలుగా అద్దె సైతం చెల్లించకుండా తాళాలు వేసి ఉన్న ఓ ఇంట్లో గుర్తు తెలియకుండా కుళ్లిన స్థితిలో పడి ఉన్న మృతదేహం లభ్యమైన ఉదంతం నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకోవటం స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జెకె కాలనీలో కూలీ పనులతో జీవనం గడుపుతున్నానంటూ వచ్చి ఓ ఇంటిని అద్దెకు తీసుకొన్న కుటుంబం గత మూడు నెలలుగా ఇంటికి తాళాలు వేసి ఊరికి వెళుతున్నామని చెప్పి తిరిగి రాలేదు. మూడు నెలలవుతున్నా వారు ఇంటికి రాకపోవటం, కనీసం ఫోన్‌లో అయినా ఎలాంటి సమాచారం ఇవ్వక పోగా వారిచ్చిన ఫోన్ నంబరు పని చేయకపోవటంతో అనుమానం వచ్చిన ఇంటి యజమాని శుక్రవారం స్థానికుల సమక్షంలో తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లారు. ఇంటిలోని వంట గది ప్లాట్ ఫాం కింద కుళ్లిన స్థితిలో పడి ఉన్న మృతదేహం కనిపించటంతో నిర్ఘాంత పోయిన ఇంటి యజమాని అందించిన సమాచారంతో నేరేడ్‌మెట్ పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకొన్నారు.

మృతదేహం గుర్తు పట్ట లేని స్థితిలో ఉండటంతో కనీసం పురుషుడిదా లేక మహిళదా అన్న విషయాన్ని సైతం నిర్ధారించ లేకపోతున్నామని, మూడు మాసాల క్రితమే ఈ సంఘటన జరిగి ఉండవచ్చని, శవ పంచనామా నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



## సజావుగా మంచినీటి సరఫరా చేయాలి

**ప్రజాపక్షం/ఉప్పల్:** చిలుకానగర్ డివిజన్‌లో మంచినీటి సరఫరా సజావుగా జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులను కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ నేతృత్వంలో నాయకులు ఉప్పల్ లోని జలమండలి కార్యాలయాన్ని సందర్శించి మంచినీటి సరఫరా విభాగం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుప్రియను కలిసి, డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. అనేక కాలనీలలో తాగునీటి కొరత, అసమర్థ సరఫరా వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని వారు తెలియజేశారు. దీనిపై స్పందించిన అధికారి సుప్రియ, చిలుకానగర్ డివిజన్ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, క్షేత్రస్థాయిలో సజావుగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అక్కిటి ఆగం రెడ్డి, మేడ్చల్ జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శి కొంపల్లి బాలరాజు, నల్లవల్లి మహేందర్, నారోజు రాధాకృష్ణ, సోను, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## జవహర్‌నగర్ పిఎస్ కేసులు మల్కాజిగిరి కోర్టుకు మార్చాలి

### బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రటరీ దుర్గం సాయినాథ్ గౌడ్ వినతి

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిమినల్ కేసులను మేడ్చల్ కోర్టు నుండి మల్కాజిగిరి జిల్లా కోర్టుకు మార్చాలని మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రటరీ, న్యాయవాది దుర్గం సాయినాథ్ గౌడ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జవహర్ నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జవహర్‌నగర్ ప్రాంతం పరిపాలన

పరంగా కాప్రా మండల పరిధిలోకి వస్తుందని, సివిల్, ఫ్యామిలీ కేసులు ఇప్పటికే మల్కాజిగిరి కోర్టులోనే పరిష్కారమవుతున్నాయని గుర్తు చేశారు. అయితే, క్రిమినల్ కేసులను మాత్రం 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న మేడ్చల్ కోర్టుకు కేటాయించడం వల్ల సాక్షులు, ఫిర్యాదుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా జవహర్‌నగర్ పిఎస్ పరిధిలో 1500 నుండి 2000 వరకు కేసులు నమోదవుతున్నాయని, కేవలం 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మల్కాజిగిరి కోర్టుకు




వీటిని బదిలీ చేస్తే ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందని వివరించారు. గతంలో ఈ ప్రాంత కేసులు మల్కాజిగిరి కోర్టులోనే ఉండేవని, జిల్లాలు మారిన తర్వాత ఏర్పడిన ఈ వ్యత్యాసాన్ని సరిచేయాలని తెలిపారు, ఈ అంశంపై పోలీస్ కమిషనర్, ఉన్నతాధికారులు స్పందించి న్యాయవ్యవస్థకు తగిన నివేదిక ఇవ్వాలని సాయినాథ్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ఇద్రిస్ ఆలీ, లక్ష్మయ్య, వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.




## ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి

**ప్రజాపక్షం/వికారాబాద్:** సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్ నుపునరుద్దరించాలి అని వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం టిజేఎస్ పిలుపు మెరకు జిల్లా కలెక్టర్ ఆర్డిఓ కార్యాలయల ముందు నిరసన కార్యక్రమం నిర్వహించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక పెండింగ్ ఉన్న నాలుగు ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరారు. దాదాపు 30నెలల పిఆర్సి రిపోర్టు తెప్పిచి జూన్ 2 లోపు అమలు చేసి 51 శాతం ఫిట్ మెంటుతో తెలంగాణ 2వ పిఆర్‌సిని,పెండింగ్ బిల్లులు నెలలకు రూ. 700 కోట్లు విడుదల చేయాలని రిటైర్ అయిన వరికి వెంటనే విడుదల చేయలని తెలిపారు. పాత పెన్స్‌న్‌విదనం అమలు చేయాలని ప్రభుత్వంన్ని డిమాండ్ చేశారు. 64 అంశాలతో పెండింగ్లో ఉన్న వాటిని సత్వరమే పరిష్కరించాలని ప్రభుత్వనికి తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## యూరియా అమ్మకాల నిలిపివేత

**ప్రజాపక్షం/శామీర్‌పేట్:** ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియా ఎరువుల అమ్మకాలను రాష్ట్ర ప్రభుతం నిలిపివేసిందని జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ అన్నారు. శుక్రవా రం మూడుచింతలపల్లి మున్సిపాలిటీలోని పలు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా సందర్శించి స్టాక్ రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫర్టిలైజర్ డీలర్లు ఎవ్వరూ కూడా ఆఫ్‌లైన్‌లో యూరియా విక్రమాలు జరుపకూడదని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ వారు యూరియా బుకింగ్ యాప్‌ను ఈ నెల 13 నుంచి నిలపివేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రవీణ తదితరులు ఉన్నారు.

## అక్రమ నిర్మాణాలు ఫుల్.. నిబంధనలు నిల్

- దూలపల్లిలో నిర్మిస్తున్న సెల్లార్ నిర్మాణం
- ఎస్ఆర్ నాయక్ నగర్‌లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం
- న్యూ స్టీల్ సిటీలో నిర్మిస్తున్న అనుమతిలేని షెడ్డు
- జయభేరి గార్డెన్‌లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం

**ప్రజాపక్షం/దుండిగల్ :** కొంపల్లి సర్కిల్ లో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్టపడడంలేదు, అక్రమనిర్మాణాలపై ఉన్నతాధికారులు టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీస్ ల పేరుతో కాలయాపన చేస్తుండడం విమర్శలకు తావిస్తుంది. అనుమతులకు మించి బహుళ అంతస్తుల నిర్మాణాలు, ఎటువంటి అనుమతులు లేకుండా భారీ షెడ్లు నిర్మిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనం వీడడం లేదు, సిఎంసి పరిధిలో అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకే, న్యాక్, టాస్క్ ఫోర్స్ లాంటి ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేయాల్సి ఉంటుంది.

జోనల్ అధికారులు ఆ దిశగా ప్రయత్నించక పోవడం, కిందిస్థాయి సిబ్బంది చెప్పిందే వేదం..చేసిందే చట్టం అన్నట్లుగా సాగుతుండడంతో కొంపల్లి సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. దూలపల్లిలో సెల్లార్ నిర్మాణం జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందడడంతో అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది సెల్లార్ తాత్కాలిక మూసివేతకు సలహాలిస్తూ నిర్మాణదారులకు పరోక్ష సహకారం అందిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తుంది, కాసులకు కక్కుర్తి పడుతున్న సిబ్బంది అక్రమ నిర్మాణదారులకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూల్చివేతలకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాల్సి ఉన్నా జోనల్ అధికారులు కాలయాపన చేస్తుండడంతో ఆయా





డివిజన్లలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అక్రమ నిర్మాణాలను అరికట్టేందు సిటీ ప్లానర్ దృష్టి సారించాలంటూ డిమాండ్ వినిపిస్తుంది. అసిస్టెంట్ సిటీ ప్లానర్, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ 10 మంది సిబ్బంది ఉన్నా అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్టపడడం లేదు. టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణదారులకు పరోక్ష సహకారం అందిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

**అనుమతులులేని నిర్మాణాలపై కఠినంగా వ్యవహరిస్తాం: డి.సి.ఎన్.కృష్ణారెడ్డి**

అనుమతులు లేకుండా నిర్మిస్తున్న నిర్మాణాలపై కొంపల్లి డిప్యూటీ కమీషనర్ ఎన్.కృష్ణారెడ్డి ని వివరణ కోరగా అక్రమ నిర్మాణాలను గుర్తించి నిర్మాణదారులకు నోటీసులు అందజేశామని త్వరలోనే పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామని అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోమని అన్నారు.

## నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ ముగ్గురు అరెస్టు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సిఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం కీసర పిఎస్ పరిధిలోని రాంపల్లి గ్రామం దయానంద నగర్ ఆఫీసర్స్ కాలనీ సర్వే నంబర్ 263.264 ప్లాట్ నంబర్ 235 రెండు వందల గజాల ప్లాటుపై ఒక స్థాయి రియల్ ఎస్టేట్ మోసం నమోదైంది. ప్లాటు అసలు యజమాని గంగాధర వీరయ్య తన ప్లాటు కుమార్తె లీలావతికి గిఫ్ట్ డీడ్ ఇచ్చాడు. వీరయ్య తన ఒరిజినల్ డాక్యుమెంటు పోగొట్టుకోవడంతో



తుకారం గేటు పిఎస్‌లో ఫిర్యాదు చేశాడు. లీలావతి 29 మార్చి 2022లో అట్టి ప్లాటును గంగి మల్లేష్‌కు విక్రయించగా తను ప్రహరీ గోడను నిర్మించుకున్నాడు. ప్లాటుకు సంబంధించి బెదిరింపు కాల్ రావడంతో కీసర పిఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ప్రధాన నిందితుడు నాం పల్లి ప్రభాకర్‌రెడ్డి(ఏ1) కి వీరయ్య ఒరిజినల్ ప్లాటు డాక్యుమెంటు లభించడంతో తన సహచారులైన ఏ3 గుడిబాటి రమేష్‌రెడ్డి, ఏ4 తుమ్మల మధుకర్ రెడ్డిలు అసలైన యజమాని గంగాధర వీరయ్యకు బదులు మరో వ్యక్తిని ఏ2 నచ్చు రామస్వామిని అసలైన ఓనర్‌గా చూపించి స్థలంను విక్రయించారు.ఈ కేసులోప్రభాకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, మధుకర్‌రెడ్డిలను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఏ2 పరారీలో ఉన్న నిందితుడిని కోసం గాలిస్తున్నారని ఆయన తెలిపారు.






## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలి

### అదనపు డిజిపి స్వాతి లక్రా

**ప్రజాపక్షం/వికారాబాద్:** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యహరించాలని అదనపు డిజిపి స్వాతి లక్రా తెలిపారు. 99 రోజుల పాటు నిర్వహించే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగం గా శుక్రవారం శ్రీసాయి దంతకళాశాలలో 'అరైవ్–అలైవ్' కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, అత్యవసర సమయాల్లో సిపిఆర్ చేయడంపై లారీ, ఆటో డ్రైవర్‌లు, అంగన్వాడీ, ఆశావర్కర్లు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి అదనపు డిజిపి స్వాతి లక్రా మాట్లాడుతూ రాష్టంలో మధ్యపానం సేవించి అతివేగంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు అధికం గా జరుగుతున్నాయన్నారు. రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఆమె తెలిపారు.

హెల్మెల్, సీట్ బెల్ట్ ధరించని కారణంగా, నిబంధనలు పట్టించకుండా డ్రైవింగ్ చేసే క్రమంలో రోడ్డు ప్రమాదాల్లో తమ విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని ఆమె అన్నారు. ఎదుటి వారి తప్పిదాల వల్ల కూడా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని దీన్ని దృష్టిలో పెట్టుకుని వాహనా లను వేగంగా నడపకూడదని ఆమె సూచించారు.

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ** మాట్లాడుతూ రోడ్డు ప్రయాణాల్లో గమ్యం ముఖ్యం కాదని విలువైన జీవితం ముఖ్యమనే విషయాన్ని గుర్తించాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలపై భద్రత కమిటీలను వేయడం జరిగిందని, ప్రతినెల రోడ్డు భద్రతపై సమావేశాలు నిర్వహించి ప్రజల్లో అవగాహనా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పి స్నేహమెహ్రా మాట్లాడుతూ ప్రమాదాలు తగ్గించడానికి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ప్రతి వాహనదారుడి బాధ్యత అన్నారు.

సంపాదించేవ్యక్తి చనిపోతే కుటుం బం మొత్తం ఇబ్బందికి గురవుతుందని ఆమె తెలిపారు. ముందుగా దంత వైద్య కళాశాల విద్యార్థులు నిర్వహించిన శాస్త్రీయ నృత్యాలు డ్రగ్స్ తీసుకుంటే కలిగే అనర్థాలపై నాటక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పి రాముల్‌నాయ క్, వైస్ ప్రిన్సిపల్ సంపత్ రెడ్డిలు పాల్గొన్నారు.

## పాలు ఇచ్చే యానిమల్ యూనిట్స్‌కు దరఖాస్తు చేసుకోండి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఎస్‌సి యాక్షన్ ప్లాన్ 202526 నందు (పాలు ఇచ్చే అనిమల్ యూనిట్స్) టార్గెట్ కు అనుగుణంగా లబ్ధిదారులు దరఖాస్తు చేసు కొనందుకు వీలుగా ఏప్రిల్ 23 వరకు గడువు పొడిగించడం జరిగిందని,ఇట్టి అవకాశన్ని జిల్లాలోని అరవులైన ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాల్సిం దిగా ఎస్‌సి కార్పొరేషన్ రంగారెడ్డి జిల్లా కార్యనిర్వాహక సంచాలకులు జొన్న లగడ్డ పద్మావతి తెలిపారుజిల్లాలోని ఎంపిడిఒ అందరు పాడి పశువుల యూనిట్స్ కొరకు లబ్దిదారులు ఒబిఎంఎంఎస్ తెలంగాణ పోర్టల్ లో దర ఖాస్తు చేసుకొనుటకు విస్తృత ప్రచారం చేయగలరని కోరారు.అదేవిధంగా తెలంగాణ ఒబిఎంఎంఎస్ పోర్టల్ లో అప్లోడ్ చేసిన అప్లికేషన్స్ (అవసరం అయిన ధ్రువపత్రాలతో)అన్ని తెప్పించుకుని పరిశీలన చేయుటకై అందరు ఎంపిడిఒ లు,మునిసిపల్ కమీషనర్ కృషి చేయాలని సూచించారు.

## మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు బోర్లు ఏర్పాటు



**ప్రజాపక్షం/కొందుర్గు:** మంచినీటి సమస్యను నియంత్రించేందుకు కొత్తగా బోర్లు వేయించినట్లు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్ర వారం జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని పద్మారం గ్రామంలో సర్పంచ్ మోహనచారి ఆధ్వర్యంలో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు రెండు బోర్లు వేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లా డుతూ పద్మారం గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్య ఉందని అనేక రోజు లుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేత రామకృష్ణ, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బాబురావు, సర్పంచులు రవి నాయక్, కన్న జంగయ్య, నందు, జ్యోతి శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచులు ధీమా గణేష్, శేఖర్, ప్రేమ్‌కుమార్, హలీం, మాజీ సర్పంచులు, నేతలు పాల్గొన్నారు.

## కొత్తగా లక్ష స్వయం సహాయక సంఘాల ఏర్పాటు:ఆర్.వి. కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొత్తగా లక్ష స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులకు సూచించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం యుసిడి అదనపు కమిషనర్ శంకరయ్య, 30 మంది ప్రాజెక్ట్ అధికారులతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 99 డేస్ ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రతి సర్కిల్ లోని ప్రాజెక్టు అధికారి 10 వేల కొత్త మహిళా సంఘాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి రిసోర్స్ పర్సన్ (ఆర్.పి) 250 మహిళా సంఘాలను ఏర్పాటు చేయాలని ఆదేశిం చారు. ఏప్రిల్ మాసంలో ప్రతి ఆర్.పి 100 కొత్త మహిళా సంఘాలను ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించారు.

## రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో తిరిగి బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని బిఆ ర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామా రావు అన్నారు. నంది నగర్‌లోని ఆయన నివాసంలో గోషామహల్ బిఆర్ఎస్ నేత ఆనంద్ కుమార్ గౌడ్ కెటిఆర్‌ను మర్యా దపూర్వకంగా కలిశారు. ఈ సం దర్భంగా నియోజకవర్గంలో పార్టీ బలో పేతం, ప్రజా సమస్యలపై జరుగుతున్న పోరాటాల గురించి కెటిఆర్‌కు ఆయన వివరించారు. నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలపై తమ వద్ద పూర్తి నివేదిక ఉందని కెటిఆర్ అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయ కులకు, కార్యకర్తలకు భవిష్యత్తులో సముచిత స్థానం ఉంటుందని కెటిఆర్ భరోసానిచ్చారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ప్రజా సమస్యల పరి ష్కారంలో ఆనంద్ కుమార్ గౌడ్ చూపిస్తున్న చొరవను అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.

## దేశం గర్వించేలా విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్చుకోవాలి

**ప్రజాపక్షం/కొత్తూరు:** దేశం గర్వించే విధంగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మల్లాపూర్ సర్పంచ్ చిట్టిడి నర్సింహారెడ్డి సూచించారు. శుక్రవారం కొత్తూరు మండల పరిధిలోని మల్లా పూర్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం అమ్మ ఆదర్శపాఠశాల చైర్ పర్సన్ సునీత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సర్పంచ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిట్టిడి నర్సింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి విద్యను నేర్చుకుంటే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను చేరుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పాఠశా లలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన పలువురు విద్యార్థులకు, సాంస్కృ తిక కార్యక్రమాల్లో విజయం సాధించిన విద్యార్థులకు మెమొంటోలు అందజే శారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పవిత్ర జయేందర్‌రెడ్డి, స్వాతి రాజేష్, హెచ్‌ఎం ఉషారాణి, నాయకులు ఎస్.రవీందర్‌రెడ్డి, ఎం.భరత్‌రెడ్డి, ఎస్.అంజిరెడ్డి, ఎస్.కృష్ణారెడ్డి, ఎస్. కమల్‌రెడ్డి, చిర్ర దర్శన్‌లు పాల్గొన్నారు.

## సేవా గుణం వికసింప చేసేందుకే హిందూ సమ్మేళనం

**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** హిందూ సమాజం పట్ల గౌరవభావం, ఏకాత్మక భావన, స్వధర్మం పట్ల అంకితభావం, సేవా గుణం వంటి వాటిని వికసింప చేసేందుకే అందరి భాగ్యస్వామ్యం కోరుకుంటూ హిందూ సమ్మేళన కార్యక్ర మం నిర్వహిస్తున్నట్లు హిందు సమ్మేళన అధ్యక్షులు సామ బీమ్ రెడ్డి తెలిపారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భ ంగా రాగన్నగూడ సబ్ స్టేషన్ ప్రక్కన శనివారం సాయంత్రం 5: గంటలకు హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని హిందూ స మ్మేళన అధ్యక్షుడుసామ భీమ్ రెడ్డి శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి తెలిపారు. వారు మాట్లాడుతూ హిందూ స మాజాన్ని చైతన్యవంతం చేసి సమైక్యపరిచి మన దేశాన్ని తిరిగి విశ్వ గురువు గా నిలపాలనే లక్ష్యంతో రాష్ట్రీయం స్వయంసేవక్ సంఘ్ 1925లో ప్రారం భించబడి ఈ 100 సంవత్సరాల కార్యక్రమంలో ఎత్తుపల్లాలని చూసిందని వా రు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలు గా ఏడుదొడ్ల శ్రీనివాస్ , కల్లెం స్వప్న , ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీ రేణుక రాజరాజేశ్వరి పీఠం నవీన్ శ ర్మ , హనుమాన్ దీక్ష గురు పీఠం జయరాం గురుస్వామి రావడం జరుగుతుం దనివారువివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులోకి శాస్త్రిపురం ఆర్‌ఒబి

ఆర్ఒబిని ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మైలార్‌దేవ్‌పల్లి నుంచి శాస్త్రిపురం మీదుగా వట్టేపల్లి వరకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన రోడ్డు ఓవర్ బ్రిడ్జి(ఆ ర్ఒబి)ని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుక్ర వారం లాంఛనంగా ప్రారంభించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి, ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌లతో కలిసి ఈ వంతెనను ప్రజలకు అంకితం చేశారు. సుమారు రూ. 71 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ వంతెన ప్రయా ణికులకు ఎంతో ఊరటనివ్వనుంది. ఈ ఆర్ఒబి ప్రారంభంతో ట్రాఫిక్ కష్టాలు తీరడమే కాకుండా, రాజేంద్రనగర్, ఫలక్‌నుమా ప్రాంతాల మధ్య రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడనుంది.
పొడవు : 490 మీటర్లు (నాలుగు లేన్‌లు).
వెడల్పు: 16.6 మీటర్లు.
రైల్వే పోర్షన్ : 37.28 మీటర్ల పొడవు.
ఈ వంతెన అందుబాటులోకి రావడంతో మైలార్‌దేవ్‌పల్లి నుంచి ఫలక్ నుమా వరకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గి, కేవలం 30 నిమి షాల్లో చేరుకోవచ్చు. ఫలక్‌నుమా బస్ డిపో నుండి మైలార్‌దేవ్‌పల్లి వరకు ఉన్న ఈ 490 మీటర్ల 4 లైన్‌ల రోడ్డును ప్రారంభించిన అనంతరం నేతలు వంతెనను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రహమత్ బేగ్, జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్, చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, ఎస్.ఈ మోహన్ రెడ్డి, డిఇఇ సంపనీ పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేను పార్టీ కార్యాలయంలోనే నిర్బంధించిన పోలీసులు



**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం:** మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డిని మేడి పల్లి గ్రామానికి వెళ్ళకుండా ఇబ్రహీంపట్నం పోలీసులు బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్బందించారు.శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మేడిపల్లి గ్రామానికి చర్చలకు వెల్లె సమయంలో ఇబ్రహీంపట్నం పోలీసులు భారీ సంఖ్యలో మోహరించి ఎమ్మె ల్యేను అడ్డుకున్నారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్థాయి మించి వ్యక్తిగత విమర్శలు చేయటం తగ దన్నారు.అధికార పార్టీ అండదండలతో నిర్బందించటం పోలీసులచే నిర్బం దించటం సిగ్గు చేటన్నారు.పోలీస్ నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు.అనంతరం పార్టీ కార్యాకర్తలు పార్టీ కార్యాలయం ముందు సాగర్ రహదారిపై మల్‌రెడ్డి రంగారెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.కార్యక్ర మంలో నాయకులు క్యామ మల్లేష్,సత్తు వెంకటరమణా రెడ్డి నాయ కులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిఆర్‌సిని ప్రకటించాలని టిజిఇజెఎసి నిరసన



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పిఅర్‌సి ని జూన్ 2 లోపు ప్రకటించా లని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ ఉద్యోగులు,గెజి టెడ్ అధికారులు,ఉపాధ్యాయులు,కార్మికులు,పెన్షనర్ల దీర్ఘకా లిక పెండింగ్ సమస్యలపై రంగారెడ్డి జిల్లా ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ (టిజిఇజెఎసి) సమరశంఖం పూరిం చారు.జిల్లాలోని అన్ని మండల,డివిజన్,జిల్లా కేంద్రాలలో శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ ,కార్మిక పెన్షనర్లు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. 2వ పిఆర్‌సి(పిఆర్‌సి)కమిటీ వేసి 30 నెలలు గడుస్తున్నా నివేదిక రాకపోవడంపై నిరసన వ్యక్తం చేస్తూ,వెంటనే నివేదికను తెప్పించి 51 శాతం ఫిట్‌మెంట్‌తో జూన్ 2వ తేదీలోపు 2వ పిఆర్‌సిని అమలు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.13,000 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలి. కొత్త ఇ హెచ్ ఎస్ (ఎంప్లాయిస్ హెల్త్ స్కీం)విధానాన్ని వెంటనే అమల్లోకి తీసుకురావాలని,ఉద్యోగులు,పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం నగదు రహిత చికిత్సను తక్షణమే అందుబాటులోకి తేవాలని కోరారు.

ప్రస్తుతం ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను రద్దు చేసి,పాత పెన్షన్ విధానాన్ని (ఒపిఎస్) పునరుద్ధరించా లని, ముఖ్యంగా 01/09/2004 కంటే ముందు నోటిఫికేషన్ ద్వారా నియామకమైన వారికి వెంటనే పాత పెన్షన్ వర్తింపజే యాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 15.25 లక్షల ఉద్యోగుల,పెన్షనర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని,ఈ 4 ప్రధాన డిమాండ్లతో పాటు ఇతర 64 పెండింగ్ అంశాలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, రంగారెడ్డి జిల్లా ఉద్యోగుల జెఏసి విజ్ఞప్తి చేస్తోందని, లేని పక్షంలో తదుపరి కార్యాచరణ ప్రకటించడం జరుగుతుంద న్నారు.అనంతరం ఆయ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తదనంతరం టిజిఇజెఎసి నాయకులు జిల్లా కలెక్టర్ ను కలిసి మెమోరాండం సమర్పించారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉద్యోగ జెఏసి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## అనధికార వాణిజ్య కార్యకలాపాలపై కఠిన చర్యలు

ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నివాస భవనాలను అనధికారికంగా వాణిజ్య కార్యకలాపాలకు విని యోగిస్తే కఠిన చర్యలు తప్పవని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి హెచ్చరించారు. ప్రజలకు మెరు గైన సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఆయన తెలిపారు. 99 రోజుల కార్యాచరణ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కమిషనర్ అల్వాల్ సర్కిల్ పరిధిలోని మారుతి నగర్, కన్నోజిగూడ, భూదేవి నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మారుతి నగర్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు మెరుగుపరచాలని అధికారులను ఆదే శించారు. అనంతరం వాణిజ్య సంస్థల్లో ట్రేడ్ లైసె న్సులను తనిఖీ చేసి, నిర్మాణంలో ఉన్న భవనాల్లో సెట్‌బ్యాక్ నిబంధనలు అమలు అవుతున్నాయో లేదో పరిశీలించారు. అలాగే పార్కింగ్ ఆక్రమణ లను వెంటనే తొలగించాలని అధికారులను ఆదే శించారు. రహదారుల పక్కన పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాలను తక్షణమే తొలగించాలన్నారు. రైల్వే కాంపౌండ్ గోడ సమీపంలో ఉన్న చెత్తను రైల్వే అధికారులతో సమన్వయం చేసి శుభ్రపరచా లని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచు కుని నీరు నిల్వ కాకుండా ఉండేందుకు కాలువల పూడికతీత పనులు క్రమం తప్పకుండా నిర్వహిం చాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పార్కుల నిర్వహణ బాధ్యతలను కూడా స్వయం సహాయక సంఘాలకు అప్పగించి సమాజ భాగ స్వామ్యాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు. కన్నోజిగూడ బ్రిడ్జి వద్ద నాలా పూడికతీత పనులను పరిశీలించిన ఆయన, వర్షపు నీటి ప్రవాహం సాఫీగా సాగేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## టిజి జెఏసి ఉద్యోగుల సమస్యలకు తక్షణమే పరిష్కారం

రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బాల్‌రాజ్



**ప్రజాపక్షం/కొందుర్గు:** తెలంగాణ జెఏసి ఉద్యోగు ల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించేందు కు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రా ష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బాల్‌రాజ్ డిమాండ్ చే శారు. శుక్రవారం కొందుర్గు తహశీల్దారుకు టిజి జె ఏసి నాయకులు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లా డుతూ రెండవ పిఆర్‌సి కమీషన్ తెప్పించి జూ న్..2వ తేది వరకు అమలు చేయాలని, ప్రభుత్వం పెండింగ్ బిల్లులు నెలకు రూ.700కోట్లు విడుదల చేసినప్పటికి బకాయిలు మాత్రం భారీగా పెరిగా యని వివరించారు. దాంతో ఉద్యోగులు తీవ్ర ఇ బ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఏకపక్షం గా రూ.1300కోట్లు చెల్లించి పెన్షనర్స్ సమస్యల ను పరిష్కరించాలని, ఉద్యోగుల, పెన్షనర్లకు ఆ రోగ్య కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చే శారు. రాష్ట్రంలో కాంట్రిబ్యుషన్ పెన్షన్ విధానా న్ని రద్దు చేసి 2004కంటే ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు వెంటనే పాత పెన్షన్ స్కీంను అమలు చేయాలని డిమాండ్ చేశా రు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించ కుండా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేయ నున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఆ ర్టియు జనరల్ సెక్రటరీ వంశీధర్‌రెడ్డి, పిఆర్‌టియు మండల అసోసియేట్ అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, టి ఎస్ యుటిఎఫ్ నాయకులు ప్రేమ్‌సాగర్, ఎస్.శ్రీదే వితోపాటు జెఏసి ఉద్యోగులు పాల్గొన్నారు.

## నార్సింగి వద్ద మూసీపై భారీ వంతెన

ఇక ముంపు కష్టాలకు చెక్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) సమీపంలోని నార్సింగి ఎగ్జిట్ వద్ద మూసీ నదిపై ఒక భారీ వంతెనను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వర్షాకా లంలో సర్వీస్ రోడ్డు జలమయం కావడం వల్ల ప్రయాణికులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. భారీ వర్షాలు కురిసిన ప్పుడు హిమాయత్ సాగర్ రిజర్వాయర్ నుండి మిగులు జలా లను మూసీ నదిలోకి విడుదల చేస్తున్నారు. దీనివల్ల మంచిరే వుల గ్రామం సమీపంలోని సర్వీస్ రోడ్డు తరచూ ముంపునకు గురవుతోంది. ఫలితంగా ఈ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి, వాహనదారులు కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారు.
హెచ్ఎండిఏ సిద్ధం చేసిన ఈ ప్రాజెక్టులో కీలక అంశాలు..
ఆర్ఆర్‌కు ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్‌లను అనుసంధా నిస్తూ మూసీ నదిపై భారీ వంతెన నిర్మాణం.
ఓఆర్ఆర్ ఎగ్జిట్ 18ఎ నుండి నార్సింగి ఇంటర్‌ఛేంజ్ వరకు మూసీ నది వెంబడి కొత్తగా సర్వీస్ రోడ్డు నిర్మాణం.
ఎగ్జిట్ 18ఎ కేవలం విమానాశ్రయ ప్రయాణికుల కోసం ప్రత్యే కంగా రూపొందించినందున, కొత్త వంతెన వల్ల విమానాశ్ర యానికి వెళ్లే వారికి ట్రాఫిక్ చిక్కులు తప్పనున్నాయి.

**భూసేకరణలో సామాజిక అంచనా నుండి మినహాయింపు..**
ఈ ప్రాజెక్టును వేగవంతం చేసే క్రమంలో ప్రభుత్వం ఉత్త ర్వులు జారీ చేసింది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం తప్ప నిసరి అయిన 'సామాజిక ప్రభావ అంచనా' నుండి ఈ ప్రాజె క్టుకు మినహాయింపునిస్తూ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల భూసేకరణ ప్రక్రియ వేగవంతమై, నిర్మాణ పనులు త్వరగా ప్రారంభమయ్యే అవకాశం ఉంటుందని అధికారులు చెప్పారు. ఈ వంతెన పూర్తయితే నార్సింగి, మంచిరేవుల, గండిపేట పరి సర ప్రాంతాల ప్రజలకు వర్షాకాలంలో ఎదురయ్యే రవాణా ఇబ్బందులు తొలగిపోతాయని అధికారులు తెలిపారు.

## తెలంగాణ ప్రజలకు తేజస్వి సూర్య క్షమాపణలు చెప్పాలి

సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అ నేది ఈ ప్రాంత ప్రజల ఎన్నో ఏండ్ల కల, అలాంటి కల సాక రమైన సందర్భంభాన్ని గురువారం నాడు పార్లమెంట్ లో పాకిస్థాన్ తో పోల్చిన బిజెపి ఎంపి తేజస్వి సూర్య తెలంగాణ ప్రజలకి వెంటనే క్షమాపణ చెప్పాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి కామ్రేడ్ అజ్మీరా హరిసింగ్ నాయక్ డిమాండ్ చేశా రు.తెలంగాణ ప్రజలు తమ ఆత్మ గౌరవం కోసం,తమ అస్తిత్వం కోసం ప్రత్యేక రాష్ట్రం ఏ ర్పాటు కావాలని 60 ఏండ్ల పాటు పోరా టాలు చేసి,ఎంతో మ ంది ప్రాణాలు అర్పిస్తే రాష్ట్రం ఏర్పాటు సాకారం అయిందన్నా రు.భూమీ,భూక్తి,విముక్తి కోసం సాగిన పోరాటాన్ని త్యాగాల ద్వారా ఏర్పడ్డ రాష్ట్రాన్ని ఉద్దే శించి గతంలో ప్రధాని నరేంద్ర మోదీ సైతం అనుచిత వ్యాఖ్యలు చేశారాని గుర్తు చేశారు.మతోన్మాద బిజెపి ప్రతిని ధులు తెలంగాణ ప్రాంతం,ప్రజలు,అమరు ల త్యాగాలు అన్న ఏ మాత్రం గౌరవం లేదని,అనేక సార్లు అవమానించారని ఆయన గుర్తు చేశారు.తెలంగాణను బి జెపి తే జస్వి సూర్య అవమానించిన కూడా ఈ ప్రాంతానికి చెందిన బి జె పి ఎంపి లు కనీసం అభ్యంతరం చెప్పకపోవటం సిగ్గు చేటు అని మండిపడ్డారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర పోరాటం ప్రపంచ చరిత్రలో నిలిచిపోతోందని అలాంటి పోరాటాన్ని,పోరాటాల తెలంగాణని ఎవరు అవమానించిన ఊరుకునేది లేద ని ,వెంటనే తేజస్వి సూర్య తెలంగాణ ప్రజలకి, అమరుల కుటుంబాలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె

షాద్‌నగర్ డివిజన్ జెఏసి కమిటీ చైర్మన్ కావలి ఆంజనేయులు యాదవ్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** విద్యుత్ ఉద్యో గుల సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని షాద్‌నగర్ డివి జన్ జెఏసి కమిటి చైర్మన్ కావలి ఆంజనే యులు యాదవ్ వివరించారు. శుక్ర వారం షాద్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిర్వహిస్తున్న సమ్మె 10వ రోజుకు చేరు కుంది. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. అంతకుముందు మోకాళ్ళపై ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కావలి ఆంజనేయులు యాదవ్ మాట్లాడుతూ జిఒ నెంబర్ 11ప్రకారం 30రోజుల పనిదినాలు కల్పిం చడంతోపా టు ఇచ్చిన హామీలను అమలు చేసి ఆర్టిజన్ కార్మికుల్లో వెలుగులు నింపాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థల్లో 2016కంటే ముందు అన్ని అర్హతలు ఉంది పని చేస్తూ ఇప్పటికి ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికులుగా కొనసాగు తున్న వారిని ఆర్టిసన్‌గా గుర్తించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఫీస్‌రేట్ కార్మికులకుజిఒ 11ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. టిజిఎన్‌పిడిసిఎల్, టిజిఎస్పీడిసిఎల్‌లలో అన్‌మ్యాన్డ్ వర్కర్లను ఆర్టిజ న్లుగా విలీనం చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యా అర్హతల ఆధారంగా ఆర్టిసన్ ఉద్యోగుల కన్వర్షన్ చేయాలి, ఆర్టిసన్లకు ఎపిఎస్ఇబి సర్వీస్ రైల్స్ అ మలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యో గుల డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంతో ఆందో ళనలు ఉధృతం చేయనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెఏసి కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డితో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

**విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తా:షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళడం జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. ఉద్యోగు లకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, ఎవరు ఆదైర్య పడోద్దని పేర్కొన్నారు. సమ్మెలు, ధర్నాలతో సాధిం చేది ఏమి ఉండదని, శాంతియుతంగా చర్చలు నిర్వహించుకొని సమస్యలను పరిష్కరించుకునేం దుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

## మేడిపల్లి గ్రామానికి ఫార్మాసిటీ తెచ్చింది మంచిరెడ్డి..

యాచారం మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు..

**ప్రజాపక్షం/యాచారం :** మండల పరి ధిలోని మేడిపల్లి నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు ఫార్మాసిటి తెచ్చింది మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అని మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవా రం యాచారం మండల కేంద్రంలోని డి ఎస్అర్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయ కులు, మేడిపల్లి గ్రామ నాయకుతో విలే కరుల సమావేశం ఎర్పాటు చేశారు. ఈ సంధర్భంగా రాచర్ల వెంకటేశ్వర్లు మా ట్లాడుతూ రైతుల భూములను కారు చౌ కగా తీసుకొని బలవంతపు భూసేకరణ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధ తి మార్చుకొని మల్‌రెడ్డి రంగారెడ్డి క్ష మాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మ స్కు నర్సింహ్మా, మేడిపల్లి సర్పంచ్ ము చ్చర్ల సుగుణ సంపత్, మాజీ ఎంపిటిసి మోటె శ్రీశైలం, ఉప సర్పంచ్ దెంది మధుకర్‌రెడ్డి, బాల్‌రాజ్, తాడిపర్తి మాజి సర్పంచ్ దూస రమేష్, రాజు, ముత్యాల వెంకట్‌రెడ్డి, తిరుమలేష్, వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మేడిపల్లి గ్రామంలో హైటెన్షన్‌కు తెర..

* క్షణ క్షణం భయం...భయం. భారీగా పోలీస్‌ల మోహరింపు...*ఇరు పార్టీల నాయకులను పోలీస్‌లు అరెస్టు చేయడంతో ఊపిరి పీల్చుకున్న ప్రజలు...



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండలం మేడి పల్లి గ్రామంలో గత వారం రోజులుగా జరుగుతున్న మాజీ శాసన సభ్యులు మంచి రెడ్డి కిషన్‌రెడ్డి....ఇబ్రహిం పట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి మధ్య జరు గుతున్న వార్‌కు శుక్రవారం తెర పడింది. పోలిస్ యంత్రాగం అప్రమత్తతో ఎలాంటి అవాంచనీయ సంఘ టనలు జరుగకుండా గట్టి బందో బస్తు ఏర్పాటు చేశారు ఇరు వార్గలకు చెందిన నాయకులను అరెస్టు చేయడంతో గోడవ సద్దుమణిగింది. మండల పరిధిలోని మేడిపల్లి , నానక్‌నగర్, తాడిపర్తి,కుర్మిద్ద గ్రామాల్లో గత ప్రభుత్వం ఫార్మాసిటి కోసం సేకరించిన భూములు విషయంలో అప్పటి ఐటి మంతి కె. తారకరామారావు, అప్పటి ఎంఎ ల్ఏ మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పెద్దెత్తున అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని మల్‌రెడ్డి రంగారెడ్డి అరోపించారు. భూము లను కబ్జాచేసి వందల కోట్ల రూపాయలు ప్రజా ధనాన్ని దోచుకున్నారని మంచిరెడ్డి పై మల్‌రెడ్డి అరోపణలు చేశారు. దానికి ప్రతిగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఫార్మాసిటి భూముల విషయంలో ఎవరి దగ్గర నయా పైసా తీసుకో లేదు నేను రైతుల నుండి ఫార్మాసిటి పేరుతో డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని అందకు ఈ నెల 17న మేడిపల్లి గ్రామంలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. శుక్రవారం ఉదయం గ్రామంలో చర్చ ఉన్న సంధర్భంగా బిఅర్ఎస్ పార్టీ నాయకులు కుర్చీలు వేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సంపత్, మధుకర్ రెడ్డి, మోటే శ్రీశైలంతో బాటు మరి కొంతమంది నాయ కులు తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. పోలీ స్‌లకు ఫిర్యాదు చేయడంతో కుర్చీలు తొలగించారు. అంతకు ముందు ఇబ్రహింపట్నం మండల కేంద్రంలో బిఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఇబ్రహీంపట్నం ఎసిపి రాజు ఆధ్వర్యంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డిని అరెస్టు చేశారు. కాంగ్రెస్ పార్టీకి చె ందిన నాయకులు ఒక వైపు, బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు ఒక వైపు గుమిగూడారు. కాంగ్రెస్ పార్టీ నా యకులు బంటి గో బ్యాక్ అంటు పెద్దెతున నినాదాలు చే శారు. గ్రామంలో అడుగు పెట్టనివ్వమని తెల్చి చెప్పారు. గ్రీన్ ఫార్మాసిటి సిఐ సత్యనారాయణ, యాచారం సిఐ నందిశ్వర్‌రెడ్డి భారీ పోలీస్ బందో బస్తుతో ముందుగా బి డఆర్ఎస్ పార్టీ నాయకులు పాశ్చభాషతో బాటు మరి కొంత మంది నాయకులు బలవంతంగా అరెస్టు చేసి కందుకూరు పోలిస్ స్టేషన్‌కు తరలించారు.యాచారం మండలం మేడిపల్లి గ్రామానికి పెద్దెత్తున కార్యాకర్తలతో మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అక్కడి కి చేరుకున్నారు. మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డిని బంటి యూత్ పోర్స్ సభ్యులను పోలిసులు బలవంతంగా అరెస్టు చేసి మహే శ్వరం ఫ్యూచర్ సిటీపోలీస్ స్టేషన్‌కు తరలించడంతో గొడవ సద్దుమణిగింది. అందరు అక్కడి నుండి వెళ్ళారు. మేడిపల్లి బంటికి వ్యతిరేఖంగా టైర్లను కాల్చి వేయగా యాచారం , ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో బిఅర్ ఎస్ పార్టీ అధ్వర్యంలో మల్‌రెడ్డిరంగారెడ్డి దిష్టి బొమ్మ లను దగ్ధం చేశారు.

